

గాఢాంధకారం.. భయానక ప్రయాణం

- గంగవరం రోడ్డులో ముసురుకున్న చీకట్లు
- రాత్రి వేళ ప్రయాణమంటేనే హడల్


రహదారిలో అంధకారం


చీకట్లో గంగవరం రోడ్డు

పెదగంట్యాడ: ఎటు చూసినా చిమ్మ చీకట్లు.. దారి కనపడక ఇక్కట్లు.. గాఢాంధకారం.. ప్రయాణం భయానకం.. ఆ రోడ్డులో రాత్రి వేళల్లో వెళ్లాలంటేనే హడలిపోతున్నారు.. ఏ క్షణాన ఏం ప్రమాదం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు.. జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని గంగవరం వెళ్లే రహదారి రాత్రి వేళల్లో చీకట్లు ముసురుకుంటున్నాయి.. ఆ గ్రామానికి వెళ్లేంత వరకూ ఒక్కటంటే ఒక్కటి కూడా వీధి దీపం లేకపోవడంతో ఇక్కట్లు పడుతున్నారు. గంగవరం గ్రామానికి చెందిన వారు అదానీ గంగవరం పోర్టుతో పాటు స్టీల్‌ప్లాంట్‌లో ఎంతోమంది పని చేస్తున్నారు. ఇందులో ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్ కార్మికులు ఉన్నారు. ప్రతి రోజూ సీ షిఫ్ట్‌కు వెళ్లేవారు.. బి షిఫ్టు ముగించుకుని ఇళ్లకు వచ్చే వారు రాత్రి వేళల్లో ఇబ్బందులు పడుతున్నారు. ఈ రహదారి మొత్తం అంధకారం కావడంతో ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. అలాగే ఆటోనగర్, శ్రావణ్ షిప్పింగ్‌లో కూడా అనేక మంది పని చేస్తున్నారు. రాత్రి వేళల్లో ఈ రోడ్డులో రాకపోకలకు అవస్థలు పడుతున్నారు.

యారాడకు ఇదే ప్రధాన రహదారి

యారాడ గ్రామానికి, తీరానికి వెళ్లాలంటే ఇదే ప్రధాన రహదారి.. ఉదయం వేళల్లో ఈ రహదారి గుండా పర్యాటకులు యారాడ తీరానికి వెళ్తున్నారు. తిరిగి చీకటి పడిన రావడానికి ఇబ్బందులు పడుతున్నారు. దారి కనకపడకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఎక్కడా లేని విధంగా ఈ రోడ్డులోనే ఎందుకు విద్యుత్ దీపాలు వెలిగించడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ స్తంభాలు ఉన్నా దీపాలు వెలిగించకుండా వదిలేయడం పలు విమర్శలకు తావిస్తోంది. దీనికి అధికారుల నిర్లక్ష్యం కారణమంటూ చెబుతున్నారు.

తరచూ ప్రమాదాలు..

గంగవరం గ్రామం నుంచి పెదగంట్యాడ, గాజువాక వెళ్లిన వారు తిరిగి చీకటి పడిన తర్వాత గ్రామానికి వెళ్లడానికి ఆపసోపాలు పడుతున్నారు. ఈ గ్రామానికి చెందిన పలువురు ఆటోడ్రైవర్లు, కూలి పనులకు వెళ్లే వారు రాత్రయితే ఇళ్లకు చేరుకోవడానికి అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో దారి కనపడని దుస్థితిలో ఉండడంతో తరచూ ఇక్కడ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ మార్గంలోనే శ్రావణ్ షిప్పింగ్ కంపెనీ ఉండడం.. ఆ కంపెనీకి పెద్ద పెద్ద లారీలు రాకపోకలు సాగిస్తుంటాయి. రాత్రి వేళల్లో ఈ రోడ్డు మొత్తం రద్దీగా ఉంటుంది. అంతేకాకుండా ఈ దారి పొడవునా రోడ్డుకు ఇరువైపులా లారీలను నిలిపి వే యడం కూడా ప్రమాదాలకు కారణమవుతున్నాయి.

ఫిర్యాదులు చేసినా ఫలితం శూన్యం

ఇక్కడి పరిస్థితిపై పలుమార్లు అధికారులకు ఫిర్యాదులు చేసినా ఫలితం లేకపోయిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీధి దీపాలు వెలగకపోవడంతో చీకట్లో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి వీధి దీపాలు వెలిగించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

నిత్యం నరకం



గంగవరం రోడ్డు నిత్యం కారు చీకట్లోనే ఉంటోంది. రాత్రి వేళల్లో ఈ రోడ్డులో ప్రయాణమం టేనే భయమేస్తోంది. వీధి దీపాలు వెలిగించాలని అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదు.

–గంటిపిల్లి అమ్మోరు, గంగవరం

చీకట్లు అలముకుంటున్నాయి



రాత్రయితే చీకట్లు అలముకుంటున్నాయి. ప్రతి రోజూ విధులకు వెళ్లి రావడానికి ఇబ్బందులు పడుతున్నాం. రాత్రి వేళల్లో దారి కనపడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎదురుగా వస్తున్న వాహనాలు తప్పించలేక పోతున్నాం. కింద పడి గాయపడుతున్నాం.

–పేర్ల నూకరాజు, గంగవరం

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు


సర్టిఫికెట్లతో చిన్నారులు

గాజువాక: గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. గాజువాక శాఖా గ్రంథాలయంలో 33 రోజులపాటు నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ముగింపు కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. వేసవి శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు వక్తల చేతులమీదుగా సర్టిఫికెట్లు, జ్ఞాపికలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు వేసవిలో వినోదంతోపాటు విజ్ఞాన సముపార్జన కోసం గ్రంథాలయంలో వివిధ కార్యక్రమాలు నిర్వహించడం హర్షణీయమన్నారు. డీసీఎంఎస్ ఛైర్‌పర్సన్ పల్లా చినతల్లి మాట్లాడుతూ గ్రంథాలయాలు విజ్ఞాన సముపార్జనకు సరైన వేదికలని అన్నారు. పిల్లల చదువు కోసం రాష్ట్ర ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని, విద్యార్థులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. 67వ వార్డు కార్పొరేటర్ పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇతర గ్రంథాలయాలకు ఆదర్శంగా గాజువాక శాఖా గ్రంథాలయానికి రూ.60 లక్షలతో అత్యంత ఆధునిక భవనం నిర్మాణం జరిగిందన్నారు. మండలంలో విద్యార్థులు, పాఠకులు గ్రంథాలయాన్ని వినియోగించుకోవాలన్నారు. ఏడీసీ చైర్మన్ బలిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ నెల రోజులకు పైగా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి శిబిరం విద్యార్థుల విజ్ఞానాన్ని పెంచడానికి దోహదపడతాయన్నారు. గ్రంథాలయాధికారి బి.చంద్రకళ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో పౌర హక్కుల సంఘం అధ్యక్షుడు తుంపాల శ్రీరామ్మూర్తి, ఐద్వా అధ్యక్షురాలు కె.సంతోషం, ఉపాధ్యాయులు ఎం.వి.శ్యామలదేవి, ఎం.లీలాదుర్గ తదితరులు పాల్గొన్నారు.

ఆ పార్టీల వైఖరేంటో స్పష్టం చేయాలి

- 'ఉక్కు' ఉద్యమంలో అందరూ ఐక్యమవ్వాలి
- 850వ రోజుకు చేరిన దీక్షలు


850వ రోజు ఉక్కుదీక్షలో కేంద్రాన్ని ఉద్దేశించి మాట్లాడుతున్న మంత్రి రాజశేఖర్

కూర్మన్నపాలెం: కేంద్రప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణ అంశాన్ని తెరమీదకు తెచ్చి 850 రోజులు గడుస్తున్న రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీల్లో ఇప్పటి వరకు ఎటువంటి స్పష్టత లేదని, కేంద్ర హోంమంత్రి అమిషా విశాఖ పర్యటన సందర్భంగానైనా అధికార, విపక్షాలు పార్టీలు ఉక్కు ప్రైవేటీకరణ వ్యతిరేకంగా తమ వైఖరిని స్పష్టంగా తెలియజేయాలని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కూర్మన్నపాలెం కూడలిలోని స్టీల్‌ప్లాంట్ ఆర్చి వద్ద జరుగుతున్న ఉక్కు రిలే నిరాహార దీక్షలు ఆదివారం నాటికి 850వ రోజుకు చేరుకున్నాయి, ఈ దీక్షలో స్టీల్‌ప్లాంట్‌లోని వివిధ విభాగాల కార్మికులు, భూనిర్వాసితులు, వారి కుటుంబాలు పెద్ద ఎత్తున పాల్గొని కేంద్ర ప్రభుత్వ విధానాలపై నినానాదలు చేశారు. ఈ సందర్భంగా పోరాట కమిటీ నాయకులు మంత్రి రాజశేఖర్, ఆదినారాయణ, అయోధ్యరామ్, వరసాల శ్రీనివాసరావు మాట్లాడుతూ దేశంలోనే అత్యధికంగా వేల కోట్లు టర్నోవర్ చేసిన విశాఖ ఉక్కు పరిశ్రమకు ఈ ఏడాది ముడి సరుకు అందించకుండా నష్టాల వైపు నెట్టారని విమర్శించారు. తెలుగు ప్రజల బలమైన ఆకాంక్ష అయిన విశాఖ ఉక్కును ప్రభుత్వరంగంలోనే కొనసాగించే విధంగా రాష్ట్రంలోని అన్ని రాజకీయ పార్టీలు కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. కార్యక్రమంలో పోరాట కమిటీ నాయకులు, ఇతర కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్ కోసం ఐక్య పోరాటాలు


ధర్నానుద్దేశించి ప్రసంగిస్తున్న తిప్పల దేవన్‌రెడ్డి

పెదగంట్యాడ: రాజకీయ పార్టీలు, కార్మిక, ఉద్యోగ సంఘాలతో కలిసి ఉక్కు ఉద్యమాన్ని ప్రజా ఉద్యమంగా చేపట్టాలని వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పల దేవన్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో చేపట్టిన నిరాహారదీక్షలు 850వ రోజుకు చేరుకున్న నేపథ్యంలో పెదగంట్యాడ జంక్షన్‌లో ఆదివారం ధర్నా చేశారు. ఉక్కు నిర్వాసితుల సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విశాఖ ఉక్కు–ఆంధ్రుల హక్కు అంటూ నినాదాలతో హోరెత్తించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణను విరమించుకునేలా ఐక్య పోరాటాలు చేయాలన్నారు. సేవ్ వైజాగ్ అంటూ సోషల్ మీడియాలో, వాట్సాప్ గ్రూపుల్లో, ఇన్‌స్టా, ట్విటర్, ఫేస్‌బుక్‌లో విస్తృతంగా ప్రచారం చేయాలన్నారు. ప్రయివేటీకరణ కుట్రలో భాగంగా ముడి సరుకు కోసం బీఎఫ్–3లో ఉత్పత్తి పునరుద్ధరణ కోసం స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం ఆసక్తి వ్యక్తీకరణ (ఈవోఐ) ప్రకటన ప్రభుత్వ రంగ సంస్థలకు మనుగడకు ముప్పు వాటిల్లుతుందన్నారు. దీనిని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిధులతోనే ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గొందేశి సత్యారావు, పులి వెంకటరమణారెడ్డి, మార్టుపూడి పరదేశి, గొందేశి మహేశ్వరరెడ్డి, పిట్టా రెడ్డి, డీవీ రమణ, మంత్రి శంకరనారాయణ, మసేనురావు, గొందేశి రాము, మంత్రి గోపీ, కురందాసు వంశీకృష్ణ, శ్రీనివాసరావు, అప్పారావు, దొమ్మేటి అప్పారావు, సుభాషిణి తదితరులు పాల్గొన్నారు.

హైమాస్ట్ లైట్లు ప్రారంభం


హైమాస్ట్ లైట్లు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి, కార్పొరేటర్ పులి లక్ష్మీభాయి

పెదగంట్యాడ: జీవీఎంసీ 75వ వార్డు పరిధిలోని సీతానగరం ఎస్సీ కాలనీ సచివాలయం ఆవరణలో కొత్తగా ఏర్పాటు చేసిన హైమాస్ట్ లైట్లను గాజువాక ఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి శనివారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాన కూడళ్లలోనే కాకుండా నిర్మానుష్యంగా ఉన్న ప్రాంతాల్లో కూడా హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకూ 75వ వార్డులో రూ.8.70 కోట్లతో రోడ్లు, డ్రైనేజీలు, సామాజిక భవనాలు, మినీ కల్యాణ మండపాలు నిర్మించామని గుర్తు చేశారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీభాయి, గొందేశి శ్రీనివాస్‌రెడ్డి, మార్టుపూడి పరదేశి, గంట్యాడ గురుమూర్తి, కణితి వెంకటరావు, వెంకటేష్, పిట్టా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మ పండగ ప్రారంభం


వంకలవీధిలో వెలసిన ముత్యాలమ్మ

దాబాగార్డెన్స్: స్థానిక 28, 29 వార్డుల గ్రామదేవత ముత్యాలమ్మ 23వ వార్షిక మహోత్సవం ఆదివారం నౌరోజీరోడ్డు, ఊట గెడ్డ, వంకలవీధిలో వెలసిన ముత్యాలమ్మ ఆలయం వద్ద ఘనంగా ప్రారంభమయింది. ప్రారంభోత్సవం సందర్భంగా గ్రామ పురవీధుల్లో చాటింపు కార్యక్రమం నిర్వహించారు. ఉత్సవంలో భాగంగా సోమవారం తొలేళ్ల ఉత్సవం వైభవంగా నిర్వహించనున్నారు. మంగళవారం ప్రధాన పండగ జరపనున్నారు. ఆ రోజు ఉదయం నుంచి అమ్మవారికి విశేష పూజలు, పంచామృతాభిషేకాలు జరపనున్నారు. భక్తులకు అమ్మవారి దర్శనం కల్పించనున్నారు. ఉదయం 6, 11 గంటలకు అమ్మవారికి పంచామృతాభిషేకాలు నిర్వహించనున్నారు. 11.30 గంటలకు వెండి ఆభరణాలతో విశిష్ట దర్శనం కల్పించనున్నారు. భక్తులచే పసుపు కుంకుమ సమర్పించనున్నారు. సాయంత్రం 5 గంటల నుంచి వంకలవీధి నుంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం జరుగుతుంది. ఈ సందర్భంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. ఈ నెల 20న అమ్మవారి మారువారం జరపనున్నట్లు ముత్యాలమ్మ సేవా సంఘం తెలిపింది.

క్లుప్తంగా

బోగాదికి సత్కారం


బోగాది సన్యాసిరావును సత్కరిస్తున్న గాజువాక సర్కిల్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు

అక్కిరెడ్డిపాలెం: ఏపీ సివిల్ సప్లైస్ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులైన 69వ వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బోగాది సన్యాసిరావును గాజువాక సర్కిల్ రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం ప్రతినిధులు నాతయ్యపాలెంలో ఆయన నివాసంలో సత్కరించారు. ఈ సందర్భంగా బోగాది మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సక్రమంగా నెరవేర్చుతానన్నారు. కార్యక్రమంలో సర్కిల్ 3 అధ్యక్షుడు కేసరపు సతీష్, ప్రధాన కార్యదర్శి గంట్యాడ అప్పలరాజు, కోశాధికారి మణిబాబు మరియు సర్కిల్ 3 డీలర్లు పాల్గొన్నారు.

అమిత్ షా సభకు తరలిన బీజేపీ నాయకులు


ర్యాలీని ప్రారంభిస్తున్న తిరుపతిరావు

గాజువాక: నగరంలో నిర్వహించిన బీజేపీ బహిరంగ సభకు ఆ పార్టీ గాజువాక నాయకులు భారీగా తరలి వెళ్లారు. ఈ సందర్భంగా స్థానిక లంకా మైదానం నుంచి బస్సులు, కార్లు, బైక్‌లతో ర్యాలీ నిర్వహించారు. బీజేపీ గాజువాక కన్వీనర్ కరణంరెడ్డి నర్సింగరావు ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని ఆ పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పూడి తిరుపతిరావు ప్రారంభించారు. కార్యక్రమంలో నాయకులు దీనంకొండ కృష్ణంరాజు, పావని, గూటూరు శంకరరావు, సోంబాబు, మల్లి కార్జునమూర్తి, నాగేశ్వరరావు, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ కోతతో అవస్థ

అక్కిరెడ్డిపాలెం: విద్యుత్ కోతలతో ప్రజలు నరకం చూస్తున్నారు. ముఖ్యంగా శనివారం అర్ధరాత్రి దాటిన తర్వాత అక్కిరెడ్డిపాలెంలో పవర్ కట్‌తో గ్రామ వాసులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అర్ధరాత్రి దాటిన తరువాత కూడా వడగాడ్పులు వీస్తుండడం పైగా విద్యుత్ కోతతో ప్రజలు నరకం చూశారు. వృద్ధులు, చిన్నపిల్లలు ఇబ్బంది పడ్డారు. అయితే తీవ్రమైన ఎండ కారణంగా ట్రాన్స్‌ఫార్మర్లు హీట్ ఎక్కడంతో ట్రిప్ అవుతున్నాయని, అందుకే విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతోందన్నారు. ఏసీలు, కూలర్ల వినియోగం ఎక్కువ కావడం కూడా ఓ కారణమంటున్నారు.

14న సీఐటీయూ ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ సీఐటీయూ ఆధ్వర్యంలో ఈనెల 14న రక్తదాన శిబిరం నిర్వహించనున్నామని స్టీల్ సీఐటీయూ ప్రధాన కార్యదర్శి యు.రామస్వామి తెలిపారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఐదేళ్లుగా రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. సెక్టార్–5లోని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ కళాక్షేత్రంలో ఆ రోజు ఉదయం 8 నుంచి 4 గంటల వరకు నిర్వహించనున్న శిబిరంలో ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు పాల్గోవాలని ఆయన కోరారు.

నైట్ షెల్టర్‌కు అనాథ మహిళ తరలింపు


నైట్ షెల్టర్‌కు తరలిస్తున్న అధికారులు

ఏయూ క్యాంపస్: జీవీఎంసీ 20వ వార్డులో సంచరిస్తున్న అనాథ మహిళను నిరాశ్రయుల వసతిగృహానికి తరలించారు. స్థానిక వైఎస్‌ఆర్‌సీపీ నాయకుడు నీల రెడ్డి ఇచ్చిన సమాచారంతో టీఎస్‌ఆర్ కాంప్లెక్స్‌లోని జీవీఎంసీ నైట్ షెల్టర్ మేనేజర్ జ్యోతిర్మయి వెంటనే స్పందించారు. అనాథ మహిళను ప్రత్యేక వాహనంలో నైట్ షెల్టర్‌కు తరలించి ఆశ్రయం కల్పించారు. అనాథలు, బిచ్చగాళ్లు ఎవరైనా రోడ్లపై కనిపిస్తే 77939 77705 నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు.

ఉత్సాహంగా కరాటే పోటీలు


కరాటే పోటీలను ప్రారంభిస్తున్న సినీ నటుడు ప్రసన్నకుమార్ తదితరులు

పెదగంట్యాడ: క్రీడలను, క్రీడాకారులను ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉందని సినీ నటుడు ప్రసన్న కుమార్ అన్నారు. అమరపిని శ్రీనివాసరావు జ్ఞాపకార్థం జీవీఎంసీ 64వ వార్డు పరిధిలోని అగ్నికుల క్షత్రియ కల్యాణ మండపంలో రెండో నేషనల్ కరాటే పోటీలను 74వ వార్డు కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి, 65వ వార్డు కార్పొరేటర్ బొడ్డు నర్సింహపాత్రుడు, 76వ వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాసరావుతో కలసి ఆదివారం ప్రారంభించారు. ముందుగా అమరపిని శ్రీనివాసరావు చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను కొనియాడారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ తిప్పల వంశీరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు విద్యతో పాటు క్రీడలపై కూడా దృష్టి పెట్టాలని సూచించారు. క్రీడల్లో రాణించిన వారికి ఉజ్వల భవిష్యత్ ఉంటుందన్నారు. అమరపిని శ్రీనివాసరావు మన మధ్య లేకపోయినా ఆయన కుమారులు నరేంద్ర శ్రీరామ్ హర్ష, హర్ష సాయి జాతీయ స్థాయి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో సిరట్ల వాసు, కేసారపు సతీష్, మూల గిరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా టీఎన్‌టీయూసీ ఆవిర్భావ వేడుకలు


యూనియన్ నాయకులను సత్కరించిన దృశ్యం

పెదగంట్యాడ: కార్మిక సంక్షేమమే విశాఖ ఉక్కు శ్రామిక టీఎన్‌టీయూసీ ధ్యేయమని ఆ యూనియన్ మాజీ అధ్యక్షుడు బొడ్డు పైడిరాజు అన్నారు. టీఎన్‌టీయూసీ 34వ ఆవిర్భావ దినోత్సవాన్ని స్థానిక సీడబ్ల్యూసీలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత 33 సంవత్సరాలుగా ఉక్కు కార్మికుల సంక్షేమం కోసం అనేక పోరాటాలు చేశామని గుర్తు చేశారు. కార్మికుల పక్షాన నిలిచి వారికి లబ్ధి చేకూర్చిన ఘనత తమ యూనియన్‌కే దక్కుతుందన్నారు. అంతేకాకుండా విశాఖ ఉక్కును ప్రయివేటుపరం చేయకుండా అడ్డుకునేందుకు కూడా పలు పోరాటాలు చేశామని, చేస్తున్నామని తెలిపారు. అనంతరం పలువురు యూనియన్ నాయకులను సత్కరించారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ ఐఆర్ అండ్ హెచ్‌ఆర్ జీఎం కె.సంజీవరావు, డీజీఎం కర్, డిప్యూటీ మేనేజర్ వెంకట్, మామిడి అప్పారావు, మొల్లి ప్రకాష్, మంత్రి రాజశేఖర్, ఎర్రయ్య, నరసింగరావు, సత్యారావు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత


స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో పాల్గొన్న వాకర్స్, కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు

అగనంపూడి: పరిసరాల పరిశుభ్రతను సామాజిక బాధ్యతగా ప్రతీ ఒక్కరూ గుర్తించాలని 79వ వార్డు కార్పొరేటర్ రౌతు శ్రీనివాసరావు అన్నారు. అగనంపూడి వాకర్స్ క్లబ్ సారథ్యంలో వాకింగ్ ట్రాక్ వద్ద స్వచ్ఛ భారత్ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. మన పరిసరాలను మనం శుభ్రంగా ఉంచుకున్న నాడు చెత్త, చెదారం, కాలుష్యం సమస్య తలెత్తదన్నారు. ప్రజా సంఘాలు ఈ విషయంలో గ్రామాల్లో చైతన్య కార్యక్రమాలు చేపట్టాలన్నారు. అనంతరం పరిసరాల్లో చెత్తా చెదారాన్ని తొలగించి వాకింగ్ ట్రాక్‌ను శుభ్రం చేశారు. కార్యక్రమంలో ప్రతినిధులు మండుగల నరసింగరావు, బలిరెడ్డి సత్యనారాయణ, బెక్కం రామారావు, బొబ్బరి సూరి, దొడ్డి దేముడు, కిడిమి హనుమంతురావు, సింగిడి సింహాచలం, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శాఖాహార విశిష్టతపై పిరమిడ్ మాస్టర్ల ర్యాలీ


ర్యాలీలో పాల్గొన్న పిరమిడ్ మాస్టర్లు

గాజువాక: పిరమిడ్ స్పిరిచ్యువల్ సొసైటీ మూమెంట్ ప్రతినిధులు ఆదివారం శాఖాహార సద్భావన ర్యాలీ నిర్వహించారు. పరమాత్మ పిరమిడ్ ధ్యానకేంద్రం ఆధ్వర్యంలో ఈ ర్యాలీ బీసీ రోడ్‌లో ప్రారంభమై గాజువాకలోని వివిధ ప్రాంతాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా పిరమిడ్ మాస్టర్లు శాఖాహార విశిష్టతను తెలియజేస్తూ నినాదాలు చేస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. శాఖాహారం తీసుకోవడం ద్వారా జీవితం ఆనందమయంగా ఉంటుందని, ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించాలని, శాఖాహారం తీసుకోవడం, ధ్యానం, యోగా చేయడంద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని వివరించారు. కార్యక్రమంలో స్పిరిచ్యువల్ సొసైటీ అధ్యక్షుడు మీసాల శివ గణేశ్వరరావు, పిరమిడ్ మాస్టర్లు బి.అప్పారావు, రేవతి, జయలక్ష్మి, సుబ్బలక్ష్మి, డాక్టర్ భాగ్యగౌరి, బాలాజీ, మూర్తి, సురేష్, నీలకంఠం, రత్నం, అప్పలనర్సమ్మ, లత, సుబుద్ధి, రామకృష్ణ, నూకరత్నం తదితరులు పాల్గొన్నారు.

తీరనున్న కరెంటు కష్టాలు

కూర్మన్నపాలెం : విద్యుత్ కోతలతో విసిగిపోయిన ప్రజలకు ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటుతో కరెంట్ కష్టాలు తీరనున్నాయి. గత కొంతకాలంగా రాత్రి సమయాల్లో గంటలకొద్ది విద్యుత్ సరఫరా నిలిచిపోతుండడంతో విసిగిపోయిన ప్రజలు శనివారం రాత్రి వడ్లపూడి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద నిరసన వ్యక్తం చేశారు. నిత్యం రాత్రి సమయాల్లో కరెంట్ కోతలతో పిల్లలు, వృద్ధులు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అధికారులు వచ్చి తమ సమస్యకు పరిష్కారం చూపాలని డిమాండ్ చేశారు. దీంతో పోలీసులు అక్కడకు చేరుకుని, విద్యుత్ అధికారులతో మాట్లాడి త్వరలోనే సమస్యను చక్కదిద్దుతామని ప్రజలకు సర్ది చెప్పడంతో ప్రజలు వెనుతిరిగారు. విద్యుత్ సమస్యల పరిష్కారంలో భాగంగా ఎలక్ట్రికల్ ఏఈ శ్రీనివాసరావు ఆదివారం ఎరుకలవీధిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేశారు. త్వరలోనే ఏడుగుళ్ల ప్రాంతం, గవరవీధి ప్రాంతాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేస్తామని, ప్రజలకు విద్యుత్ సరఫరాలో సమస్యలు తలెత్తకుండా చూస్తామని తెలియజేశారు. గతంలోనే వడ్లపూడి సబ్‌స్టేషన్ పరిధిలోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్‌లను ఏర్పాటు చేసేందుకు ప్రణాళికలను రూపొందించామని, కానీ ప్రజలు సహకరించలేదన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం


బహుమతులతో చిన్నారులు

పెదగంట్యాడ: వేసవి విజ్ఞాన శిబిరాల ద్వారా విద్యార్థుల్లో దాగి ఉన్న ప్రతిభను వెలికితీసే అవకాశం ఉంటుందని సాహిత్య సుధ వ్యవస్థాపక అధ్యక్షుడు అద్దంకి రాఘవాచార్యులు అన్నారు. నెల రోజుల పాటు పెదగంట్యాడ శాఖా గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం ఆదివారంతో ముగిసింది. ఈ సందర్భంగా శిబిరంలో పాల్గొన్న చిన్నారులకు సర్టిఫికెట్లు మెమొంటోలు అందజేశారు. ఈ కార్యక్రమంలో నడుపూరు జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు రాచకొండ శ్రీనివాస్, గ్రంథాలయాధికారి పీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

భగ్గుమన్న భానుడు


తన కుమారుడి తలపై చున్నీ కప్పి తీసుకువెళుతున్న తల్లి

అక్కిరెడ్డిపాలెం: ఆదివారం భానుడు తన ప్రతాపం చూపించాడు. సెగలు పుట్టించాడు. అక్కిరెడ్డిపాలెంలో వీధులన్నీ నిర్మానుష్యంగా మారాయి. బయటకు రావడానికి ఎవరూ సాహసించలేదు.

బాలరాజు ఇంటికి మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి


కిరణ్‌కుమార్‌రెడ్డిని సత్కరిస్తున్న బాలరాజు, తదితరులు

ఎంవీపీ కాలనీ: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి ఆదివారం మాజీ మంత్రి బాలరాజు ఇంటికి వెళ్లారు. ఇటీవల జరిగిన బాలరాజు తనయుడి వివాహానికి ఆచప హాజరుకాలేకపోయారు. ఈ నేపథ్యంలో ఆదివారం విశాఖ వచ్చిన కిరణ్‌కుమార్‌రెడ్డి.. బీచ్ రోడ్డులోని వుడా పార్కు సమీపంలోని బాలరాజు ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులతో మాట్లాడారు. ఆయన తనయుడికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నగర అధ్యక్షుడు పంచకర్ల రమేష్ బాబు, పలువురు కాంగ్రెస్ పార్టీ మాజీ నాయకులు పాల్గొన్నారు.

దయాల్‌బాగ్ వస్త్ర ప్రదర్శనకు స్పందన


దుస్తుల ప్రదర్శనను పరిశీలిస్తున్న ఆరిలోవ సీఐ సోమశేఖర్

ఆరిలోవ: జీవీఎంసీ 9వ వార్డు విశాలాక్షినగర్ ప్రాంతం దయాల్‌నగర్‌లో దయాల్‌బాగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఆదివారం ఏర్పాటుకు చేసిన వస్త్ర ప్రదర్శనకు విశేష స్పందన లభించింది. సెయింట్ జోసెఫ్ కాలేజ్ ఫర్ ఉమెన్ బీఎస్సీ రెండో సంవత్సరం హోం సైన్స్ విద్యార్థులకు ఇంటర్న్‌షిప్‌లో భాగంగా ఇక్కడ 40 రోజులు పాటు డ్రెస్ డిజైనింగ్‌లో శిక్షణ ఇచ్చారు. కళాశాలకు చెందిన 26 మంది విద్యార్థులు తర్ఫీదు పొంది తయారు చేసిన కుర్తాలు, నైటీలు, గౌన్లు, పైజమాలు, టీషర్టులు తదితర వాటిని ఇన్‌స్టిట్యూట్ నిర్వాహకులు ఆదివారం ప్రదర్శించి, విక్రయించారు. ఈ ప్రదర్శనను ఆరిలోవ సీఐ సోమశేఖర్ ప్రారంభించారు. అనంతరం ఆయన ఇక్కడ ప్రదర్శనలో పెట్టిన వస్తువులను పరిశీలించారు. శిక్షణ పొందిన విద్యార్థినులతో మాట్లాడి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చదువుతో పాటు చేతి వృత్తిలో నైపుణ్యం ఉంటే భవిష్యత్‌లో ఉపయోగపడుతుందన్నారు. ఇన్‌స్టిట్యూట్ ఇన్‌చార్జి దక్షిణమూర్తి, కార్యదర్శి డాక్టర్ రాజేష్ వెంకట్, ఇన్‌స్ట్రక్టర్లు పాల్గొన్నారు.